



# చదువుకునే రోజుల్లో

**అవంతి**

నేను ఇంటర్మీడియేట్ చదివేరోజులు. అన్ని సబ్జక్టుల్లోను ఉత్తీర్ణుడినయేను కాని, బోటనీ మాత్రం నా దుంప తెంపింది. బోటనీ (వృక్షశాస్త్రం)లో, సూక్ష్మదర్శినిగుండా వృక్షజాలంయొక్క అంతర్నిర్మాణము పరీక్షించాలి. కాని నాకు సూక్ష్మదర్శినిలోంచి చూడ్డం చేతకాదు. దాంట్లోంచి ఒక్క సెల్ కూడా ఎప్పుడూ నాకు కనపడలేదు. అంచేత, మా డిమాన్‌స్ట్రేటర్‌కి నేనంటేమంట. మొక్కలయొక్క సెల్ నిర్మాణం రికార్డు పుస్తకములో శుభ్రముగా గీస్తున్న యితర విద్యార్థుల అభివృద్ధికి సంతోషపడుతూ నా బల్ల దగ్గరకొచ్చేవాడు. కొరడులా నిల్చుని 'నాకేమీ కనపట్టము లేదండి' అనేవాడిని. పాపం, ఆయన శాంతంగా మొదలుపెట్టేవాడు.—సూక్ష్మదర్శిని లోంచి చూడటం ఎంతతేలికో, మిగతా అందరూ ఎట్లా చూస్తున్నారో చెప్పి, చివరకు కోపంతో నాకు కనపడినా కాని, కనపడటం లేదంటున్నానని నిందించేవాడు. 'ఈ పద్ధతి పువ్వులయొక్క సౌందర్యాన్నే నాశనం చేసేస్తుందండి' అనీ వాడిని. 'పువ్వులయొక్క యంత్ర నిర్మాణంతోనే మన ప్రసక్తి కాని, వాటి సౌందర్యముతో కాదు,' అని గర్జించీ వాడు.

'నాకేమీ కనపడటం లేదండి' అనీ వాడిని. మళ్లీ 'ఇంకోసారి ప్రయత్నించి చూడవోయ్!' అనీ వాడు. పోనీ పెద్దవాడేదో చెప్తున్నాడు కదా అని చూసే వాడిని. అప్పుడప్పుడు, ఏదో తెల్లగా పాల లాంటి పదార్థం తప్ప మరేం కనిపించేదికాదు. అంటే సూక్ష్మదర్శిని సరిగా అమర్చలేదన్నమాట. సామాన్యంగా గాజులపలక మీదుంచిన వృక్ష పదార్థం, గదులు గదులుగా వింతరంగుల్లో కనిపించాలిట. ఆయన సూక్ష్మదర్శిని సరిగా అమర్చి, నన్ను చూడమనీ వాడు. నాకు మళ్లీ, పాలుమాత్రమే కనిపించేవి.

ఆ యేడు బోటనీ షరాలాగా పరీక్షతప్పి, సెప్టెంబరు పరీక్షకు కట్టేను. ఆ వేసవిసెలవుల్లో, బి. ఎస్. సి. విద్యార్థుల్ని తోటపల్లి హిల్స్, మొదలైన చోట్లకు ఎక్స్‌కర్షన్ తీసికెళ్లి, గాలి



బాగాపడి, మా మాష్టరు మంచి హుషారుగా వచ్చేరు - కాలేజీ కుర్రాళ్ళందరికీ వృక్షశాస్త్రం కరతలామలకం చెయ్యడానికి.

ప్రిన్సిపాల్ అనుమతితో, బోటని ప్రాక్టికల్స్‌కి నేనూ వెడుతున్నాను. 'ఏమోయ్! యీసారి నీకు బాగా కనిపిస్తాయనుకుంటాను సెల్స్' అన్నాడు.

'కనిపిస్తాయండి!' అన్నాను. నాచుట్టుపక్కల విద్యార్థులంతా సెల్స్ చూసి, డ్రాయింగ్ కూడా గీసేస్తున్నారు. కాని నాకుమాత్రం యింకా అగమ్యగోచరంగానే వుంది.

'ఈసారి ప్రయత్నించు. మానవుడి నేర్పంతా యిమిడ్చి తయారుచేసిన యీ సూక్ష్మదర్శినిలోంచి వస్తువులు నీకు కనపడనేనా కనపడాలి, లేకపోతే యీవుద్యోగం వదిలేసి, పొలం దున్నుకుంటాను.' అని ఘోరప్రతిజ్ఞ చేసి పారేసేడు, ఆయన.

మానవుడి నేర్పంతా యిమిడ్చి తయారుచేసిన సూక్ష్మదర్శిని అమిర్చి, చూసేను. కనపడింది! కనపడింది!! ఏవో చుక్కలు, గీతలు, మొదలైనవి కనపడ్డాయి. ఈ సదవకాశం చేయిజారనిస్తే లాభంలేదని, నాకు కనపడ్డవి కాగితంమీద గీసేసేను. నేనేదో గీస్తూండటాన్ని పక్కబెంచీ దగ్గర్నుంచి క్రీగంట కనిపెట్టి, చాలా ఆశలతో పెదిమలపై చిరునవ్వుతో, నాదగ్గర కొచ్చేడు. నా డ్రాయింగ్ కాగితం చూసి, అదిరిపడి, ఏడుపొస్తున్న గొంతుకతో,—

'నువ్వేమిటి గీస్తున్నావ్ ?!' అన్నాడు.

'నాకు కనపడ్డదే గీసేనండి' అన్నాను.

'అబద్ధం' అని అరిచేడు.

తనుకూడా, సూక్ష్మదర్శినిలోంచి చూసేడు. ఒక్కసారిగా నిలువెత్తు లేచి—

'అది నీ కన్ను! నీ కన్ను ప్రతిఫలించేలా అమర్చేవు, యీ లెన్సు. నువ్వు గీసింది నీకన్ను!' అన్నాడు.


ఈ డిమాన్‌స్ట్రేటర్ గారిని గురించి ఇంకో రెండు మాటలు చెప్పి, యీ విషయం ముగిస్తాను. ఆయన, తెలుగును ఇంగ్లీషులోకి తర్జుమాచేసి మాట్లాడతాడు. 'ఆ స్టారూ! యీ బాచ్‌తో ఎక్స్‌కర్షన్‌కు నేను కూడా వస్తానండీ!' అన్నాడొకసారి. 'ఆఁ! యు కేమ్ లాస్ట్‌టు టైమ్, నో యు కమ్! డోన్ట్ టెల్ దీజ్ వర్డ్స్ ఎట్ మి' అనేవాడు. ఆయన్ని ఒకవిధంగా, షేక్స్‌పియర్ లాగ, ఆంగ్లభాషా నిరంకుశుడనవచ్చు 'కమింగ్ లేట్, అండ్ శాటింగ్ ఆన్ ది బేక్ బెంచెస్ లార్డ్లీ యస్‌లీ! ఎహ్! ఐ టోలరేట్ యిట్ నాట్' అనీ వాడొక్కసారి (చలంగారు వ్రాసినట్లు, ఇంగ్లీషుమాటల్ని తెలుగులిపిలో వ్రాయడం కష్టంగానే వుంది!)

ఇంటర్మీడియట్ ఎల్లాగోగట్టెక్కి, ఎకనమిక్సు బి. ఏ. లో చేరేను. బోటనీలో నాకున్న విజ్ఞానానికీ, యీ ఆర్థికశాస్త్రానికీ ఎక్కడా లంగరందలేదు. కాని యీ విషయంలో నా కంటె మునుకింకో మన్నాడు. వాడిపేరు ఓనమాలస్వామి, మంచి ఫుట్‌బాల్ ఆటగాడు. ఆ రోజుల్లో, ఆంధ్రాయూనివర్సిటీ కాలేజీల్లోకల్లా, మా కాలేజీది, చాలామంచి టీము. కాని దానికో దిక్కుమాలిన గోల్ పడ్చింది. క్లాస్‌వర్కులో సరిగా వుంటేనే కాని, టీములో స్థలంవుండదు. వీడు లేకపోతే టీమంతా పడుకుంటుంది. కాని వీడి మెదడు సైజులో, చాలాచిన్నది. అందుచేత లెక్చరర్లంతా వాడికి సహాయము చేసేవారు. మా ఆర్థిక శాస్త్ర నిపుణుడు, పాపం, నిజంగా ఆయనో దేముడు. ఓనమాల స్వామికి ఆయన చేసినంత సహాయము ఇంకెవరూ చేయలేరు.

ఒకరోజున పాఠం చెప్తూ, ఆయన—

'రవాణా సౌకర్యాల్లో ఒక్క దానిని పేర్కొనుము.' అన్నాడు, ఓనమాలస్వామి కేసి చూస్తూ. వాడికేం తట్టలేదు.

'ఏదో ఒకటి...' అన్నాడు గురువుగారు మళ్ళీ. నిశ్శబ్దం.



'అంటే, ఒక చోటినుండి ఇంకొకచోటికి పోవు పద్ధతి, వాహనము, లేక ఏజన్సీ.' అన్నాడు.

ఓనమాలస్వామి భయపడుతూ దిక్కులు చూస్తున్నాడు.

'గుర్రపుబళ్లు, విద్యుచ్ఛక్తి, అవివివల్ల నడపబడేవి. వీటిలో ఏదో ఒకటి చెప్పు. దూరప్రయాణాలు చెయ్యడానికి మనం ఎక్కుతూంటామే, అదిచెప్తే బాగుంటుంది' అన్నాడు.

మిగతా విద్యార్థులంతా, ఆందోళనగా, తమ స్థలాల్లోనే, అటూ యిటూ కదుల్తున్నారు. చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దముగా వుంది క్లాసు అంతా. ఇంతలో, ప్రొఫెసర్ గారే నిశ్శబ్దాన్ని ఛేదించేరు 'ఛు...ఛు...ఛూఛూ... యీౘౘౘ!' అనే వింత శబ్దముతో. విజయనగరం కాలేజీతో మాచ్ యింక వారం రోజులే వుంది. ఈ ఓరల్ టెస్టులో వీడు నెగ్గకపోతే టీములో చోటుండదు. అందుచేత విద్యార్థులంతా సానుభూతిగా వున్నారు, వాడంటే. వెనకాలనుంచి

ఎవడో, రైలుకూత కూసేడు. ఇంకొకడు, రైలు యింజను ఆవిరివదలిపెట్టే శబ్దాన్ని బహుచక్కగా అనుకరించేడు. ప్రొఫెసరుగారు 'డింగ్‌డాంగ్! డింగ్‌డాంగ్!' అన్నారు, స్టేషను గంటవాయించినట్లు. ముఖం ఎర్రపడిపోయి, చేతులు నలుపుకుంటూ. నేలను చూస్తూ, కనుబొమలు చిట్లించి, ఓనమాలస్వామి, ఆలోచించడానికి ప్రయత్నిస్తున్నాడు.

'ఈ ఏడాది కాలేజీకెల్లా వొచ్చేవు నువ్వు?' అన్నాడు ఆ దేవుడులాంటి ప్రొఫెసరు.

'మా నాన్న పంపేడు దబ్బిచ్చి' అన్నాడు స్వామి.

'అది కాదోయి బాబు! ఏమి ఎక్కివచ్చితివి?'

'రైలు' అన్నాడు ఓనమాలస్వామి, కొంచెం భయపడుతూనే.

'అద్దిగదీ! రైట్, ఏమోయి శ్రీనివాస్! నువ్వు, ఆర్థిక శాస్త్రంలో పారిశ్రామిక విప్లవం తెచ్చిన...' అంటున్నాడు ప్రొఫెసర్‌గారు.

బోటనీ, ఎకనమిక్సు లాగనే, ఫిజికల్ ట్రైనింగ్ అంటే, నాకు భర్జించదు. నాకళ్ళ జోడుతో వాళ్లు ఆడనివ్వరు. అది తీసేస్తే నాకు కనిపించదు. అది తీసేసి, హారిజాంటల్ బార్స్‌నీ, క్రికెట్ స్టంప్సునీ, మా గ్రౌండ్‌లోంచి ఇళ్ళకు పోయే యితర స్కూళ్ళ పిల్లల్నీ, గుద్దేస్తూండేవాడిని. మా స్నేహితుడొకడు, నానెంబరుచెప్పి, వాడే అన్నీ చేసి, ఆడి, నన్నాపరీక్షలో ఉద్ధరించేడు.

ఆ సంవత్సరమే, కొత్తగా మిలిటరీ ట్రైనింగ్ కూడా ప్రారంభించేరు విద్యార్థులకి. కర్రతుపాకులు భుజాన్నేసుకుని, రోజల్లా కదం తొక్కుతూ, 1857 స్వాతంత్ర్య సమరం నాటి యుద్ధ వ్యూహాలని నేర్చుకుంటూండేవాళ్ళం. ప్రతిరోజూ పొద్దుట కాఫీలు తాగి, వందల కొద్దీ విద్యార్థులు, మా ఆర్ట్సు కాలేజీ మామిడి తోటలో మాక్ బాటిల్స్ (సీసాలుకావు) చేస్తూంటే, సంతలా వుండేది.

మిగతా విద్యార్థులు ఏడుస్తూ అయినా, సైనిక తర్ఫీదు నేర్చుకుంటున్నారు. నాకుమాత్రం, ఏం చేత కాలేదు. మా కాలేజీ కమాండర్ అయిన లెఫ్ట్‌నెంట్ కలొనల్ ఆశీర్వాదం, నా దగ్గర కొచ్చి, 'ఈ కాలేజీ మొత్తానికి నీఅంత దౌర్భాగ్యుడులేడు' అన్నాడు. నాకు మొదట డ్రిల్ చెయ్యడం సరిగా వచ్చిందికాదు. కాని నేను బి. ఏ. సీనియర్‌లోకి వచ్చేటప్పటికి, మూడేళ్ళ అనుభవం మూలంగా, డ్రిల్లులో నేను ప్రావీణ్యం సంపాదించేనని చెప్పుట, అతిశయోక్తి కాదనుకుంటాను.



నా ఫస్టుయియర్‌లో యిచ్చిన యూనిఫారంలో అప్పుడే బస్‌కండక్టర్‌లా వుండేవాడిని. మరి ఆ వెలిసిపోయిన బిగువైపోయిన యూనిఫారంలో బి. ఏ. సీనియర్‌లో ఎల్లా వుండేవాడినో మీరే వూహించుకోండి. ఆ యూనిఫారం మూలాన నాకు తల కొట్టేసినట్లనిపించినా కానీ, సాధకం మూలాన డ్రిల్లులో అత్యద్భుత నైపుణ్యం సంపాదించేను.

ఒక రోజున, లె. క. ఆశీర్వాదం మాస్క్వాడ్‌ను ప్రత్యేకంగా డ్రిల్లుకు పిలిచేడు. మమ్మల్ని కంగారుపెట్టడానికి కాబోలు, ఆర్డర్లు త్వరగా యిచ్చేస్తున్నాడు.



'స్క్వాడ్స్ కుడి! స్క్వాడ్స్ ఎడమ!; స్క్వాడ్స్ రైట్ ఎబౌట్;' మొదలుగా. ఇల్లాగే రెండు నిమిషాలు గడిచేటప్పటికి, 109 మంది ఒకవేపు పోతున్నారు; నేనుమాత్రం, వాళ్లకి 45

డిగ్రీలలో ఒక్కణ్ణీ నిశ్చింతగా, లెఫ్ట్ - రైట్ కొట్టుకుంటూ మార్చి చేస్తున్నాను.

'కంపెనీ! హాల్టు!' అని లె. క. ఆశీర్వాదం, 'అతనొక్కడే సరిగా చేస్తున్నాడు' అన్నాడు, నన్ను చూపెడుతూ. నా, యీ, ఘనకార్యానికి నన్ను కార్పొరల్ గా ప్రమోట్ చేసేరు.

ఆ మర్నాడు లె. క. ఆశీర్వాదం నన్ను తన ఆఫీసుకు పిలిపించేడు. నే వెళ్లేటప్పటికి, చీల్చిన యీతాకుల చీపురుతో యీగల్ని చంపుతున్నాడు. అతడేమీ మాట్లాడలేదు. నేనూ పలకరించలేదు. ఒకవేళ నన్ను పిలిపించిన సంగతి మరిచి పోయేడేమో. టేబిల్ మీదవున్న కాగితంమీద, ఒక యీగవాలి, కాళ్లు దులుపుకుంటూంది. లె. క. ఆశీర్వాదం అతి జాగ్రత్తగా చీపురు ఎత్తుతున్నాడు. నేను కొంచెం కదిలేను. ఈగ ఎగిరిపోయింది.

'నువ్వే బెదర కొట్టేసేవు దాన్ని' మొరిగేడు ఆశీర్వాదం.

'నా తప్పిదానికి చాలా విచారిస్తున్నాను' అన్నాను.

'నువ్వెంత విచారిస్తే ఏం? ఎగిరిపోయిన యీగని తీసుకురాగలవా?' అన్నాడు. ఆయన తర్కానికి ఆశ్చర్యపోయేను.



చాలా సేపటికి వరకు, శూన్య దృక్కులతో, కాలేజీ గ్రౌండ్ లో తిరిగే, అబ్బాయిల్నీ, అమ్మాయిల్నీ కిటికీలోంచిచూస్తూకూర్చున్నాడు. చివరకు, నే వెళ్లిపోవచ్చునన్నాడు. నేను బయటికొచ్చేసేను. అసలు నన్నెందుకు పిలిపించేడో యింతవరకూ నా కర్థమవలేదు.

# మన పత్రికల ధోరణి

గత రెండు సంవత్సరాలనుంచీ మన రాష్ట్రం నుండి వెలువడే మాసపత్రికలు పక్ష పత్రికలు వార పత్రికలు లెక్కకు మిక్కుటంగా వున్నాయి. కాగితం కరువు పోయినందువల్ల అడిగిన పెద్దమనిషి కల్లా కాగితం కోటా సప్లైయిచేస్తోంది, మన ప్రభుత్వము ముందూ వెనుకా యోచనలేకుండా. నవ నాగరికత ప్రబలిన ఈ ఇరవయ్యో శతాబ్దిలో ఎక్కువ పత్రికలు వుండడం సమంజసమే. కాని ఈ పత్రికలు తమ బాధ్యతను ఏ విధంగా నిర్వహిస్తున్నాయి?

పత్రికా ముఖంగా ప్రజానీకంలో ఎన్నో మార్పులు తెచ్చే అవకాశాలు వున్నాయి. కాస్తో కూస్తో ఉన్నత విద్యాధికుడైన పత్రికాధిపతి ఒక లక్ష్యాన్ని ఆదర్శంగా పెట్టుకొని సాయశక్తులా పాఠకులకు విజ్ఞానాన్నిచ్చే చక్కని పత్రికను అందజేయడం అతని విధి. కాని ఈ ఆదర్శాన్ని ఎంతమంది మన పత్రికాధిపతులు ఆచరణలో పెడుతున్నారు? పత్రికా నిర్వహణ మన చేతుల్లోవుంది గదా అని వున్నవీ లేనివీ కల్పించి వూసుబోని వూకదంపుళ్లతో పత్రికల్ని నింపేస్తున్నారు. నిజానికి ఈ కోత వ్రాతలు పాఠకులకు ఏ విధంగా వుపకరిస్తున్నాయి?

పత్రికాధిపతులు తమ కర్తవ్యాన్ని గుర్తించి సాధ్యమైనంతవరకు పాఠకలోకానికి వివేకాన్నిచ్చే రచనలతో, ఆర్థిక సాంఘిక రాజకీయ సమస్యలను ఎదుర్కొనే మార్గాల్ని సూచిస్తూ ఇంపుగా వ్రాయబడిన సంపాదకీయంతోను, పసందైన కథలతోనూ తమ పత్రికల్ని ప్రజానీకాని కందచెయ్యాలి.

విశాఖపట్టణము — బి. టి. వసంతకుమార్